జిందగీ చైతన్య

నమస్తే తెలంగాణ హైదరాబాద్

సోమవారం 13 మే 2024 www.ntnews.com

ఆధ్యాత్మిక సోపానాలు

'నగృహం బంధనాగారం బంధనే నచ కారణమ్
మనసాయో వినిర్ముక్తో గృహస్థోపి విముచ్యతే!'

ఇల్లు అనేది కారాగారం కాదు, అది బంధన కారణం కూడా కాదు. మనసే అన్నిటికీ కారణం. అది బంధరహితంగా ఉంటే గృహస్థాశ్రమంలోనే ఉండి మోక్షాన్ని సాధించవచ్చు... ఈ విషయాన్ని శ్రీ దేవీ భాగవతం మనిషికి బోధిస్తుంది. అష్టాదశ పురాణాల్లో అద్వితీయమైన దేవీ భాగవతం ఉపాసనకు జ్ఞానాన్ని సమన్వయించి, ఒకవైపు ఐహిక ప్రయోజనాలు సాధిస్తూనే, పారమార్థిక సాధనకు మార్గాన్ని అన్వేషించేవారికి దారిచూపుతుంది. ఇందులో 11వ అధ్యాయం మనిషి పాటించాల్సిన నిత్య విధులను వివరించింది. శారీరక, మానసిక వ్యవస్థలను శుభ్రపరచుకుని ఆధ్యాత్మిక ప్రగతిని సాధించే విధానాలెన్నో తెలియజేసింది.

సదాచారం: లోకంలో ద్రవ్యజ్ఞానం, దివ్యజ్ఞానాలని రెండు రకాల విజ్ఞతలున్నాయి. లౌకిక విషయాలపై పరిజ్ఞానాన్ని ద్రవ్యజ్ఞానం అంటారు. పారమార్థిక ప్రయోజనాలను సాధించి పెట్టేది, దైవాన్ని పరిచయం చేసేది దివ్యజ్ఞానం. ఈ రెండిటినీ సమపాళ్లలో సమన్వయం చేసుకున్న వారి జీవితాలు ధన్యతను పొందుతాయి.

శౌచవిధి: వేదవేదాంగాలు వల్లించినా, ఆచారహీనుడు పవిత్రుడు కాలేడు. మనిషి ముందు తన ఒంటి పరిశుభ్రతను, ఇంటి స్వచ్ఛతను పాటించాలి. అప్పుడే గృహస్థు ధర్మ నిర్వహణకు అర్హత లభిస్తుంది.

భూతశుద్ధి: సుఖసంతోషాలు డబ్బులో ఉండవు. ప్రకృతితో కలిసి ప్రయాణించడం, ప్రకృతిని ఆరాధించడంలో ఆనందం దాగుంది. ప్రకృతి స్వరూపాలైన పంచభూతాలను ఆదరిస్తూ, పూజిస్తూ ఉండమని దీని సందేశం.

ఇదే అధ్యాయంలో రుద్రాక్షధారణ విధిని, శిరోవ్రత విధానాన్ని, గాయత్రీ ఉపాసన, విభూతిధారణ ఫలితాలను వివరణ ఉంది. అంటే శారీరక పరిశుభ్రత, మానసిక ప్రక్షాళన, దరిమిలా ఆధ్యాత్మిక జీవనం ద్వారా ఉత్తమ గతులను సాధించే మార్గాలను దేవీభాగవతం ద్వారా తెలుసుకోవచ్చు.

• శ్రీ

స్వధర్మం పరధర్మం



శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః!
(భగవద్గీత-3-35)

'స్వధర్మంలో సుగుణాలు అంతగా లేకున్నా, పరధర్మంలో సుగుణాలు ఎన్ని ఉన్నా.. చక్కగా అనుష్ఠించే పరధర్మం కన్నా స్వధర్మాచరణమే ఉత్తమం. స్వధర్మాచరణలో మరణం సంభవించినా శ్రేయస్కరమే కానీ, పరధర్మం భయావహం' అని ఉపదేశించాడు గీతాచార్యుడు.

శ్రేయస్సు అంటే.. సమగ్రత, సంయమనత. భౌతిక జీవితంలో ప్రగతి, ఆధ్యాత్మిక జీవితంలో సుగతిని పొందడమే శ్రేయస్సు. ఏది తను చేయదగిన పని.. ఏది తాను చేయకూడని పని అనేది తెలుసుకోవడమే సరైన యోగసాధన. అదే శ్రేయస్సును ఇస్తుంది. చేయదగిన పనిని తెలుసుకునే నైపుణ్యం, దానిని ఆచరించడంలో శ్రద్ధ.. ఈ రెండు కలిగిన వారు ఆచరించే కర్మలనే సత్కర్మలు అంటారు. శ్రద్ధ అంటే ఏమిటి? శ్రత్, ధ.. శ్రద్ధ. 'శ్రత్' అంటే గుర్తించదగిన సత్యసంధత స్థితి లేదా నిష్ఠతో కూడిన సత్యసంధత. 'ధ' అంటే ధరించడం లేదా సత్యసంధతను సాధించడం వైపు మనం చేసే ప్రయత్నం. ఆదర్శవంతమైన ఉత్తమ లక్ష్యాన్ని సాధించేందుకు సత్యమార్గంలో చేసే ప్రయత్నాన్ని శ్రద్ధగా చెప్పుకోవచ్చు. సత్కర్మాచరణమే 'స్వధర్మం'!. ఈ ప్రకృతి 'స్వభావాన్నే' ధర్మం అంటారు. దానినే లక్షణం అని కూడా అంటున్నాం. స్వధర్మాచరణ వల్ల త్రిగుణాతీతమైన ప్రజ్ఞ వ్యక్తిలో జాగృతమవుతుంది.

స్వధర్మాన్ని తెలుసుకోవడం ఎలా? భౌతిక ప్రపంచంలో ముఖ్యంగా రెండు విలువలు ఉన్నాయి. ఒకటి వినియోగ విలువ. రెండోది.. కళాత్మక విలువ. భౌతిక జీవితాన్ని సుఖవంతంగా తీర్చిదిద్దడంలో సహకరించేది.. వినియోగ విలువ! అలాగే.. భౌతిక జీవితాన్ని సదుపయోగం చేసుకోవడానికి ఉపయోగపడే దానిని కళాత్మక విలువగా పరిగణిస్తాం. పరస్పర అనుబంధంతో జీవించడమే విలువలతో పయనించడం. మానవ విలువలు సహజ స్వీకృతి ఆధారంగా వెలుగు చూడాలి. భయానికి, ప్రలోభాలకు, ఎవరి బలవంతానికి, మూఢవిశ్వాసాలకు లోనుకాకుండా సరైన అవగాహనతో, తనకు తాను విచారించుకొని ఉత్తమమని భావించినదై, సహజంగా ఆమోదం పొందేదే సహజ స్వీకృతి. నిజాయతీ, నైతికత, స్వతంత్రత, సామరస్యత, సహనశీలతలే సహజ స్వీకృతికి మూలాలు. ఆ సహజ స్వీకృతే స్వధర్మంగా గుర్తింపు పొందుతుంది. స్వధర్మాచరణ.. వ్యక్తి ఆలోచనలో, ప్రవర్తనలో, కర్మాచరణలో, అవగాహనలో ప్రస్తుతం 'ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి' ఎదిగేందుకు ఉపకరిస్తుంది.

స్వధర్మానికి భిన్నంగా ఉండేది.. పరధర్మం. దాన్ని ఎంత నిష్ఠతో ఆచరించినా.. అందులో ఎన్ని సుగుణాలు కనిపించినా.. ఎంతటి ఆకర్షణ ఉన్నా.. అది జీవన లక్ష్యాన్ని చేరడానికి సుఖకరం కాలేదు. తాత్కాలికంగా సుఖంగా ఉన్నట్లుగా భ్రమింపచేయగలదేమో కాని, పరమమైన శ్రేయస్సును పరధర్మం ఇవ్వలేదు. స్వధర్మాచరణలో మరణం ఎదురైనా దానిని ఆహ్వానించడమే ఉత్తమం అంటాడు కృష్ణుడు.

అర్జునుడు క్షాత్ర ధర్మాన్ని ఆచరించే దీక్షాబద్ధుడైన వాడు. ఆ ధర్మాచరణలో ఎదురయ్యే సాధక బాధకాలను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు. ధర్మాన్ని కాపాడ గలిగిన శక్తిసామర్థ్యాలు కలిగినవాడు. అలాంటివాడు తీరా యుద్ధరంగానికి వచ్చి అస్త్రసన్యాసం చేయడం.. తన ధర్మానికి వ్యతిరేకమైన తాపస వృత్తిని చేపడతాననడం.. అధర్మమే అవుతుంది. అంటే పరధర్మమవుతుంది. అది క్లీబత్వమే కాక గర్హనీయం కూడా! చాంచల్యత కలిగిన సమయంలో.. పైపైన చూసినప్పుడు స్వధర్మంలో లోపాలు కనిపించవచ్చు. పరధర్మం ఉత్తమంగా కనిపించవచ్చు. తాను, తనవారనే మోహ సముద్రంలో మునిగిన అర్జునుడు ధర్మగ్లానిని పట్టించుకోకపోవడం పరధర్మాచరణమే. అలాంటి పరధర్మాచరణ కన్నా స్వధర్మాచరణలో మరణం ఎదురైనా దానిని స్వాగతించడమే ఉత్తమమని బోధిస్తున్నాడు కృష్ణుడు. అనుక్షణం అనుమానంతో భయపడుతూ ఎంతటి నిష్ఠతో ఆచరించినా పరధర్మం భయానికి హేతువే! సంశయాత్ములకు చివరికి లభించేది వినాశనమే. కాబట్టి స్వధర్మాచరణయే ఉత్తమమని జగద్గురువు బోధ.

... పాలకుర్తి రామమూర్తి

చౌక.. ఖరీదు

ఒక పండితుడు గ్రామంలోని కొందరు యువకులకు ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు నిర్వహించే వాడు. ఊరికి సమీపంలో ఉన్న పట్టణంలో ఉన్న కృష్ణ మందిరంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ వేడుకల్లో భక్తులకు సేవ చేయడానికి సహాయకుల అవసరం వచ్చింది. కొందరు యువకులను పంపమని నిర్వాహకులు పండితుడిని కోరారు. అందుకు ఆయన సంతోషంగా అంగీకరించాడు. యువకులు సైతం సహాయకులుగా వెళ్లడానికి ఎంతో ఉత్సాహం చూపారు. వారు పట్టణానికి వెళ్లే రోజు రానే వచ్చింది. శిక్షణ పొందుతున్న యువకులను, పండితుడు రెండు బృందాలుగా విభజించాడు. మొదటి జట్టును పిలిచి మీరు సేవ తోపాటు అక్కడ కారుచౌకగా ఏమి దొరుకుతుందో గమనించమన్నాడు. అలాగే రెండో బృందంతో, మీరు వెళ్తున్న ప్రదేశంలో ఎక్కువ ఖరీదైనది ఏమిటో పరిశీలించమన్నాడు. ఆలాగేనని చెప్పి యువకులు వేడుకలకు బయల్దేరారు. వారం రోజులపాటు సేవ చేసి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు.

వస్తూ వస్తూ మొదటి బృందంలోని సభ్యులు గురువు తమకు చెప్పింది గుర్తుకు తెచ్చుకున్నారు. పట్టణమంతా తిరిగి 'బొరుగులు' కారుచౌకగా ఉన్నాయని గుర్తించారు. ఒక మూట బొరుగులు కొన్నారు. తమ తెలివికి పండితుడు అభినందిస్తాడని భావించారు. రెండో జట్టులోని సభ్యులు అక్కడ వీధులన్నీ గాలించి 'వజ్రం' ఎక్కువ ఖరీదైనదని నిర్ణయానికి వచ్చారు. అందరూ చందాలు వేసుకొని ఓ వజ్రపుటుంగరాన్ని కొన్నారు. దానిని ఇస్తే గురువు చాలా సంతోషిస్తారని భావించారు. అందరూ కలిసి గ్రామానికి చేరిన తర్వాత.. పండితుడిని కలుసుకున్నారు. కుశల ప్రశ్నలయ్యాక మొదటి జట్టు బొరుగుల మూట చూపించింది. రెండో బృందం వజ్రపుటుంగరాన్ని చూపించింది. అప్పుడు ఆ పండితుడు చిన్నగా నవ్వి 'నేను గమనించమన్నది ఇవి కాదు. ఈ ప్రపంచంలో చిరునవ్వును మించిన చౌకైనది లేదు. కోపం కన్నా ఖరీదైనది లేదు. కోపం వల్ల కలిగే నష్టాల విలువను అంచనావేయలేం. మిమ్మల్ని జన సమూహంలో గమనించమన్నది అదే' అని వివరించాడు. 'నవ్వితే కోటి లాభాలు, కోప్పడితే కోటి నష్టాలు!' అని తెలుసుకున్నారు ఆ యువకులు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

ఖురాన్ చెప్పిన కుటుంబ పాఠం

తమ ఆయుష్షు పెరగాలనుకునేవారు, తమ సంపదను పెంచుకోవాలని భావించేవారు, దుర్మరణం నుంచి తప్పించుకోవాలనుకునే వారు సిలారెహ్మీ (బంధువులతో సంబంధాలను నెరవేర్చడం) చేయాలని చెప్పారు ముహమ్మద్ ప్రవక్త (సఅసం). ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, మరణ భయం ఇవి మనిషిని నిత్యం వెంటాడుతుంటాయి. ఒక్కోసారి ఆరోగ్య సమస్యలు మృత్యుముఖంలోకి చేరుస్తాయి. ఆర్థిక ఇబ్బందులు మనశ్శాంతి లేకుండా చేస్తాయి. ఈ సమస్యల నుంచి బయట పడాలనుకునేవారు... బంధువుల హక్కులు నెరవేర్చాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. రక్త సంబంధీకులు, తోబుట్టువులు, ఇతర దగ్గరి బంధువుల హక్కులు నెరవేర్చడంలో అలక్ష్యం చేయరాదన్నది ఖురాన్ హెచ్చరిక.

కుటుంబ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఖురాన్ గ్రంథం మరెన్నో సూచనలు చేసింది. 'బంధుత్వ సంబంధాల విషయంలో అల్లాహ్‌కు భయపడండి' అని ఖురాన్ హెచ్చరిస్తుంది. ప్రళయదినాన్ని విశ్వసించేవారే బంధువుల హక్కులను నెరవేరుస్తారని ఈ పవిత్ర గ్రంథం పేర్కొన్నది. 'మీ దగ్గరి బంధువుల హక్కును నెరవేర్చండి' అని ఖురాన్ పదేపదే హెచ్చరించింది. నిరుపేద బంధువుల పట్ల కారుణ్యం చూపాలని, ప్రేమ, వాత్సల్యాలతో మెలగాలని సూచించింది. 'ఆస్తి పంపకాలు జరిగేటప్పుడు ఇతర బంధువులు, అనాథలు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తినుంచి వారికి కూడా కొంత ఇవ్వాలి' అని ఖురాన్ ఉద్బోధ. భార్యాభర్తల బంధంతో ఒక్కటయ్యే కుటుంబంలో అన్నా, చెల్లి, భార్య, భర్త ఇతరత్రా బంధుత్వాలు ఏర్పడతాయి. ఈ సభ్యుల కలయికతో ఏర్పడే కుటుంబం పదికాలాల పాటు మనగలగాలంటే బంధువుల హక్కులను నెరవేర్చాలి. బంధువులను అందరికంటే ఎక్కువగా ప్రేమించాలి. ప్రేమను వ్యక్తపర్చాలి. నిరుపేద బంధువుల అవసరాలను తీర్చాలి. 'మీకు రెండు చోట్ల నుంచి విందుకు ఆహ్వానం అందితే అందులో దగ్గరి రక్తసంబంధీకులెవరో వారింటికి వెళ్లండి' అని చెప్పారు ప్రవక్త మహనీయులు. ప్రవక్తలు, వారి సహచరులంతా తమ బంధువుల హక్కులు చక్కగా నెరవేర్చారు. మనవల్ల ఏదైనా తప్పు జరిగితే బంధువులను మన్నించమని వేడుకోవడంలో ఆలస్యం చేయరాదని, ఎవరైనా మన్నించమని ప్రాధేయపడితే తక్షణం స్పందించాలని ఇస్లామ్ బోధనల స్ఫూర్తి. దీనివల్ల దెబ్బతిన్న బంధుత్వ సంబంధాలు మెరుగవుతాయి. వైరం కారణంగా తమ సోదరుడితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదని ప్రవక్త (స) హెచ్చరించారు. రక్త సంబంధీకులు, దగ్గరి బంధువులతో సంబంధాలను తెగదెంపులు చేసుకుంటే అల్లాహ్ అనుగ్రహం గగనమే! అలాంటి వారు ఎన్ని దైవారాధనలు, ఉపవాసాలు, హజ్ యాత్ర చేసినా ప్రయోజనం ఉండదని ప్రవక్త బోధనల సారాంశం. బంధువుల పట్ల ప్రేమ, వాత్సల్యం కనబర్చినప్పుడే కుటుంబ వ్యవస్థ పటిష్ఠమవుతుంది. కుటుంబం బలంగా తయారైతే సమాజం పరిపుష్టం అవుతుంది.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

యమళార్జున భంజన లీల

శుక యోగి– పరీక్షిన్మహారాజా! ఆలోచనామృతమైన బాలకృష్ణుని 'ఉలూఖల బంధన'లీలలో చాలా పరమార్థాలు దాగి ఉన్నాయి. 'ఈ లీల ఐశ్వర్యశక్తికి, వాత్సల్యరక్తి– ఆసక్తికి మధురమైన కలహం' అన్నారు భావుకులైన భాగవతులు. ప్రేమకు వశుడై శ్యామబ్రహ్మ బంధింపబడుట ఆయనకు భూషణమే కాని దూషణం కాదు. అలంకారమే కాని కళంకం ఏ మాత్రం కాదు. ఆ బంధనం అచ్యుతుని 'సచ్చిదానంద' స్వరూపస్థితికి ఎటువంటి విచ్యుతి– విఘాతం (పతనం) కలిగించదు. 'బుల్లికృష్ణుడు భగవంతుడే– శ్రీహరియే ఐతే తల్లి ఈ తరహాగా రోటికి కట్టగలదా?' అని సంశయించాడు కంసుడు. నందగోపాలుని ఐశ్వర్యశక్తిని అంత గోపనీయం– రహస్యంగా ఉంచింది వాత్సల్య మూర్తి గోపకాంత యశోద. 'నిగమాలు– వేదాలనే అరణ్యాలలో వెదికి వెదికి కనుగొనలేక ఖిన్నులై– విసిగి వేసరి ఉన్న ఓ సూరి జనులారా! విద్వాంసులారా! మీరు కోరే అగమ్యమైన 'ఉపనిషదర్థములూ ఖలే నిబద్ధమ్' ఉపనిషత్తుల ఆ పరమార్థం బాల ముకుందుని రూపంలో నంద ప్రభువుల వారి గృహంలో దేవేరి (నందరాణి) యశోదచే ఉలూఖలాని (రోటి)కి నిబద్ధమై– కట్టబడి ఉండటాన్ని అవలీలగా కనుగొనవచ్చు' అంటాడు లీలాశుకుడు.



ఆధ్యాత్మిక సాధనలో అత్యంత బాధకాలైన కామ క్రోధ లోభాలకు లోనైన వాడెంతవాడైనా– అవతార పురుషుడైనా భయానికి, పలాయనానికి, బంధనానికి గురి కావాల్సిందే! కాన, సాధకులు ఎంతో సావధానంగా ఉండాలి. పెచ్చరిల్లిన కామాదులు హెచ్చైన దేవుణ్నే (కృష్ణుని) వదలకపోతే లొచ్చైన జీవులను ఎలా వదలుతాయి? అని సున్నితమైన, లోతైన హెచ్చరిక! 'అహో చిత్ర మహోచిత్రం'– ఆహా! కొందరు నిర్గుణ, నిరాకార, నిర్వికార బ్రహ్మను, మరెందరో సగుణ, సాకార బ్రహ్మను ఉపాసింతురు గాక! అయితే, ఏ ప్రేమ బంధానికి బద్ధుడై అనంత ప్రాణులకు ముక్తి ప్రదాత, స్వయం నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త స్వభావం కలిగిన ఆ పరబ్రహ్మ భక్తులకు 'క్రీడామృగీకృతమ్'– ఆటబొమ్మ అవుతున్నాడో, 'వందేతత్ప్రేమ బంధనమ్'– ఆ ప్రేమ బంధానికి 'మా వందనం' అంటారు భాగవత వ్యాఖ్యాతృ చక్రవర్తి ఆచార్య శ్రీధరులు.

శుకుడు– రాజా! శ్రీరమాలోలుని– బాలకృష్ణుని రోల– రోటికి కట్టిన నందబాల చాల గొప్పపని చేశానని అనుకొని సంతసించి ఇంటిపనిలో మునిగిపోయింది. కన్నయ్య తన ఇంటి పెరట్లో ఎప్పటినుంచో ఉన్న రెండు పెద్ద మద్ది (అర్జున) చెట్లను కన్నాడు. నలకూబర మణిగ్రీవులనే ఇద్దరు యక్షులు– కుబేర పుత్రులు నారద మహర్షి శాపం వలన మద్ది వృక్షాలుగా పడి ఉన్నారు. వారిద్దరినీ చూచి వారిజాక్షుడు హరి రోలు ఈడ్చుకొంటూ ఆ చెట్ల దరికి చేరాడు.' ఇలా బాదరాయణి– శుకముని అనగానే విని అవనీపతి పరీక్షిత్తు, ఆ శాపం పొందడానికి వారు చేసిన పాపం– అపచారం ఏమిటో తెలపమని ఆదరపూర్వకంగా అడిగాడు.

శుకుడు– రాజా! నలకూబర మణిగ్రీవులు నీలకంఠ భగవానుని సేవకులు. 'కుబేరుని కుమారులం, పరమశివుని పరిచారకులం కదా!' అన్న అహంకారంతో సదా సంచరిస్తూ ఉండేవారు. ఒక నాడు వారు కైలాసగిరిపై గంధర్వకాంతలతో జలక్రీడలు సాగిస్తున్నారు. ఇంతలో ఆ మార్గాన యతివరుడు నారదుడు విచ్చేశాడు. ఆయన్ని చూసి అతివలు గబగబా వలువలు ధరించారు. మద్యం మత్తులో చిత్తై ఉన్న యక్షపుత్రులు మహర్షి సమక్షంలో కూడా పొగరు కొద్దీ దిగంబరంగానే ఉండిపోయారు. అదిచూచి నారదుడు వారిని శపించబోతూ విజ్ఞతతో ఒక చక్కని సత్యాన్ని లోకానికి వక్కాణించాడు. గొప్ప సంగీతజ్ఞుడైన ఆ మహర్షి నోట వెలువడిన ఆ మాట ఇలా ప్రసిద్ధమైన ఓ పాటగా రూపొందింది..

శా॥ 'సంపన్నుండొరు గానంలేడు తనువున్ సంసారమున్ నమ్మి హిం
సింపం జూచు దరిద్రుఁడెత్తువడి శుష్కీభూతుడై చిక్కి హిం
సింపండన్యుల నాత్మకున్ సములగాఁ జింతించు నట్టేటఁ ద
త్సంపన్నాంధున కంజనంబు విను మీ దారిద్ర్య మూహింపగన్'

'ధనవంతుడు ఎంత గుణవంతుని కూడా గణుతింపడు– లెక్క చెయ్యడు. తన సంపదను, శరీరాన్ని, సంసారాన్నీ నమ్ముకొని తన హితానికి, స్వార్థానికి ఇతరులను హింసించాలనే, వెత (బాధ)లకు గురి చేయాలనే చూస్తాడు. దరిద్రుడు దారిద్ర్యానికి చిక్కి పెక్కు బాధలు పడుతూ కూడా పరులను బాధించడు. వారూ తనవంటి వారే కదా అని భావిస్తాడు. ఇది లోకరీతి. కాన, ఆలోచించగా ధనమదంతో అంధులైన వారికి దారిద్ర్యమే సరైన అంజనం (కాటుక)గా తోస్తున్నది'. ఇలా నీతి విశారదుడు నారదుడు గీతం ఆలపించి, 'కలవాని– కుబేరుని కొడుకులమని మదంతో కదం తొక్కుతున్నారు కాన, ఇల (భూమిపై)లో మద్ది వృక్షాలుగా వంద దివ్య సంవత్సరాలు పడి ఉండండి. చెట్లుగా పుట్టినా మీ మదిలో ఆదిదేవుని– విష్ణుని పట్ల భక్తి భావం పదిలంగా ప్రవర్తిల్లుతుంది. అదికూడా నా అనుగ్రహ ఫలంగానే. ఆపై ముకుందుడైన నందనందనుని దివ్య పాదారవింద స్పర్శతో మీరు హరిభక్తులై సుర(దేవ) లోకానికి మరల గలరు'. ఇలా పలికి నారదుడు నారాయణాశ్రమానికి వెళ్లిపోయాడు. ఇది శాపమా లేక వరమా? ఉద్ధవుని వంటి సిద్ధ పురుషులు– మహాత్ములు మునీశ్వరులు కూడా బృందావనంలో వృక్షరూపంగా జన్మించినా చాలని కోరతారు! ఆ యక్షులిద్దరూ వెంటనే మద్ది చెట్ల జంటగా నందుని ఇంట పెరట్లో పుట్టారు. ఇప్పుడు పరమ భాగవతుడైన నారదుని పలుకులను పాటించ దలచాడు యదుకుల తిలకుడు.

కం॥ 'ముద్దుల తక్కరి బిడ్డఁడు
మద్దులఁ గూల్చంగ దలచి మసలక తా నా
మద్ది కవ యున్న చోటికి
గ్రద్దన రోలీడ్చుకొనుచుఁ గడకం జనియెన్'

మాయదారి ముద్దుకృష్ణునికి, మద్ది మానులకు మధ్య ఉన్న లోకానికి తెలియని జన్మాంతర అనుబంధపు పద్దు (పంతం, ప్రతిజ్ఞ)ను (కౌంతేయ ప్రతి జానీహి నమే భక్తః ప్రణశ్యతి– అర్జునా! నా భక్తుడెన్నడును నష్టానికి గురికాడు– గీతావాక్యం) పోతన తన సొంతమైన ఈ కంద పద్యంలో ముద్దుగా ఎంతో ఒద్దిక (పొందిక)తో దిద్దాడు. మాయలమారి ముద్దుకృష్ణుడు మద్ది మ్రాకులను కూల్చి ఆ ఇద్దరు భక్తులను ఉద్ధరించాలన్న ఉద్దేశంతో వెంటనే ఆ చోటికి, గ్రద్దన– అమాంతంగా రోటిని ఈడ్చుకుంటూ వెళ్లి, తన ధాటికి అడ్డం తిరిగిన బరువైన ఆ రోటిని తరువుల మధ్య ఉంచి సూటిగా లాగాడు. ఆ చెట్లు రెండూ వ్రేళ్లతో సహా భయంకరమైన శబ్దంతో నేల కూలిపోగా, చాలాకాలం తర్వాత వాటికి శాపం తొలగిపోయింది. యక్షులు నిజరూపంలో వెలిగిపోతూ ప్రత్యక్షమయ్యారు. భక్తలోక పాలకుడైన గోప బాలకునకు తల వంచి నతించి– నమస్కరించి, నుదుట చేతులు జోడించి ఇలా నుతించారు..

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

కం॥ 'భువనములు సేయఁగావఁగ
నవతీర్ణుడవైతి కాదె యఖిలేశ్వర! యో
గి వరేణ్య! విశ్వమంగళ!
కవి సన్నుత! వాసుదేవ! కల్యాణనిధీ!'

'వాసుదేవా! నీవు సర్వేశ్వరుడవు. మహాయోగివి. ఈ సృష్టికి సర్వశుభాలు చేకూర్చే వాడవు. వాల్మీకి వ్యాస, కాళిదాస, భాసాది విద్వత్కవులచే– దివ్యజ్ఞాన సంపన్నులచే వినుతింపబడువాడవు. నిగనిగలాడే కల్యాణ గుణరత్నాలకు నిధివి– తరగని గనివి. లోకాలను సృష్టించి, రక్షించుటకై అవతరించువాడా! నీకు అనేక నమోవాకాలు. నీ కృప వలన మేము తరించాము'. కల్యాణ నామం ఫలాత్మకం. మంగళ నామం సాధనాత్మకం. 'సిద్ధిదః సిద్ధి సాధనః' (విష్ణు సహస్ర నామాలు)– సాధన, సిద్ధి (ఫలం) రెండూ సిద్ధ సంకల్పుడైన భగవంతుడే!

శుకుడు– రాజా! నలకూబర మణిగ్రీవులు తమ ప్రతి ఇంద్రియానికి భక్తిరస పానం చేసే భాగ్యం ప్రసాదించమని అర్థించారు...

శా॥ 'నీ పద్యావళు లాలకించు చెవులున్, నిన్నాడు వాక్యంబులున్
నీ పేరంబని సేయు హస్త యుగముల్, నీ మూర్తి పైఁ జూపులున్
నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్, నీ సేవపైఁ జిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరజ పత్రేక్షణా!'

.. 'అరవింద దళాక్షా! సత్కవులు రచించే శ్రవణీయమైన నీ స్తుతులను వినే చెవులను, నీ నామ, రూప, గుణ, లీలా, ధామ, కీర్తుల వైభవాన్ని ప్రస్తుతించగల వాక్పటిమను, నీకు సమర్పితంగా మంచి చేతలు ఆచరించు చేతులను, నీ దివ్యమంగళ రూపాల– అర్చావిగ్రహాల యందే నిగ్రహంతో నిలిచి ఉండే చూపులును, నీ పాద పద్మాలను ఆదరంగా మొక్కే ఔదలలు– శిరస్సులను, నీ సేవలోనే తరించాలనే యావ (తపన) కలిగి ఉన్న మనస్సులను, కుంటుపడక నీతోనే అంటగలిగి ఉండు బుద్ధులను (పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి– భాగవతం) వెనువెంటనే మాకు ప్రసాదించు'. నీ, నీ, నీ.. అంటూ అంతా నీవే, నీదే. నేను, నాది అనేది ఏది లేనే లేదు, 'త్వమేవ సర్వం మమ దేవదేవ' అన్న 'సర్వ సమర్పణ' భావాన్ని ఈ పద్యంలో అఖర్వం (నిండు)గా పండించాడు భక్త కవి పోతన. ఇది భావుక భక్తులందరికి ఆదర్శ ప్రాయమైన నిత్యప్రార్థన. (సశేషం)